ఆరాధన

ధార్మిక మాసపత్రిక

డిసెంబరు, 2012

వెల : రూ.10/-

శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం

యాదగిరిగుట్ట, నల్లగొండ జిల్లా

దేవాదాయ ధర్మాదాయశాఖ, ఆంధ్రప్రదేశ్

దివ్యవనాలు - విశిష్టత 26

జె. వేణిమాధవి
నేచురలిస్ట్

(గత సంచిక తరువాయి)

నవగ్రహ వనం / నవ ధాన్యవనం

6) శుక్రగ్రహం

మొక్క - జేడుంబర వృక్షం
ధాన్యం - అనుములు

శుక్రగ్రహానికి సూచించిన వృక్షం జేడుంబర వృక్షం మరియు ధాన్యం అనుములు (అనప చిక్కుడు, అడవి చిక్కుడు). ఈ దివ్యవృక్షం, ధాన్యాలను తూర్పుదిక్కులో నాటుకోవాలి.

మేడిచెట్టు



శుక్రగ్రహం



అనుములు

హిమకుంద మృణాళాభం, దైత్యానాం పరమం గురుం
సర్వశాస్త్ర ప్రవక్తారం, భార్గవం ప్రణమామ్యహం.



మేడిపండ్లు

ఆనప చిక్కుడుకాయలు

7) శనిగ్రహం

మొక్క - శమీవృక్షం ధాన్యం - నువ్వులు

శనిగ్రహంతో అనుసంధానం చెంది, దానియొక్క గుణాలను ప్రతిబింబించేవి శమీవృక్షం, నువ్వుల మొక్క. వీటిని పడమర దిక్కులో నాటుకోవాలి.

సాధారణంగా ధాన్యం మొక్కలు ఒక కాపు కాసి చనిపోతాయి. వాటినుంచి వచ్చిన విత్తనాలు పడి అవి తిరిగి మొలకెత్తుతాయి. వాటిని మరల వివరంగా నాటి పాదులు చేసుకోవచ్చు. లేదా ఒక మడిలాగా గుంపుగా పెంచుకోవచ్చు. తీగ మొక్కలకి వాటికి అనువైన పందిరి వేసుకుంటే మొక్కలు పెరగడానికి బాగుంటుంది.



జమ్మిచెట్టు

శనిగ్రహం

నువ్వులు మొక్క

నీలాంజన సమాభాసం, రవిపుత్రం యమాగ్రజం
ఛాయా మార్తాండ సంభూతం, తం నమామి శనైశ్చరం

జమ్మి పువ్వులు

నువ్వుల పువ్వు



నువ్వులు

శ్రీ దత్తజయంతి (డిసెంబరు 27)

శ్రీ దత్తుడు సాక్షాత్తూ మేడిచెట్టు, రావిచెట్టు మూలల్లో నివాసం ఉంటాడని శ్రీ గురుచరిత్రలో ప్రస్తావించబడింది. ఒకానొక సందర్భంలో శ్రీ గురుడు గంగాంబ అనే స్త్రీకి 60 ఏళ్ళ వయస్సులో సంతానాన్ని అనుగ్రహించారు. శ్రీ గురుడు ఆమెను అశ్వత్థ వృక్షానికి ప్రదక్షిణ చేయమని, తానెల్లప్పుడూ అశ్వత్థ వృక్షంలో వుంటానని, అందువల్లనే పురాణాల్లో దానిని 'అశ్వత్థ నారాయణుడు' అని కీర్తించడం జరిగిందని తెలిపారు.

బ్రహ్మాండ పురాణం

గంగాంబ కోరికమేరకు శ్రీ గురుడు, బ్రహ్మాండ పురాణంలో శ్రీ నారదముని చెప్పిన అశ్వత్థం యొక్క ప్రాశస్త్యాన్ని ఇలా వివరించారు.

అశ్వత్థ వృక్షంలో సర్వదేవతలూ ఉంటారు. అశ్వత్థమే నారాయణ స్వరూపం. ఆ వృక్షం యొక్క మూలమే బ్రహ్మ. దాని మధ్యభాగమే విష్ణువు. దాని చివరి భాగమే శివుడు. కనుక దానిని పూజిస్తే త్రిమూర్తులను పూజించినట్లే. అలాగే త్రిమూర్తులు దాని దక్షిణ, పడమర, ఉత్తర దిక్కుల్లోని కొమ్మల్లో ఉంటారు. తూర్పు దిక్కున వున్న కొమ్మల్లో ఇంద్రాది దేవతలుంటారు. దాని వ్రేళ్ళలో మహర్షులు, గోబ్రాహ్మణులు, నాలుగు వేదాలుంటాయి. సప్త సముద్రాలు, పుణ్య

అందరినీ సంతోషపెట్టాలనుకునేవారు ఎవరినీ సంతృప్తి పరచలేరు.

నదులు తూర్పు కొమ్మల్లో ఉంటాయి.

ఆ చెట్టు యొక్క మూలంలో 'అ' కారము, మానులో 'ఉ' కారము, దాని పండ్లు 'మ' కారము కలిగివుంటాయి. ఆ వృక్షమంతా కలిసి ప్రణవస్వరూపమే. అది సాక్షాత్తూ కల్పవృక్షమే.

రావిచెట్టును సేవించవలసిన విధానం

* అశ్వత్థ ప్రదక్షిణం చైత్ర, ఆషాఢ, పుష్య మాసాల్లోను, గురు శుక్ర మౌఢ్యాల్లోను, కృష్ణపక్షంలోను ప్రారంభించకూడదు.
* శుభముహూర్తంలో స్నానాదులు చేసుకొని, శుచియై ఉపవసించి ప్రారంభించాలి.
* ప్రవహిస్తున్న నీటిలో స్నానంచేసి, ఉతికిన వస్త్రాలను ధరించి మొదట గణపతిని పూజించి, కలశంలో గంగ యమునలను పూజించాలి. అప్పుడు సంకల్పంచేసి అశ్వత్థ వృక్షానికి భక్తితో ఏడుసార్లు అభిషేకం చేయాలి. ఆ తరువాత మరలా స్నానం చేసి దేవతామయమైన ఆ వృక్షానికి పురుషసూక్త విధానంగా షోడశోపచార పూజ చేయాలి.

పాప సంహారిణి

* ఆ తదుపరి పీతాంబరం ధరించిన నారాయణుని ఎనిమిది బాహువులు గలవానిగా ధ్యానించాలి. తరువాత విష్ణు సహస్ర నామం చదువుతూ లేదా మౌనంగా గాని, ఎంతో నెమ్మదిగా ప్రదక్షిణలు చేయాలి. ప్రతి ప్రదక్షిణానికి మొదట, చివరా నమస్కారం చేయాలి. ఇలా రెండు లక్షల ప్రదక్షిణలు చేస్తే సర్వపాపాలు నశించి, నాలుగు పురుషార్థాలు సిద్ధిస్తాయి.
* గురువారం, అమావాస్య కలిసినరోజు రావి చెట్టు నీడన స్నానం చేస్తే పాపం నశిస్తుంది.

సంతానప్రాప్తి

* త్రికరణశుద్ధిగా దానిపై దృష్టిని నిలిపి, బిడ్డలు కలగాలన్న సంకల్పంతో ప్రదక్షిణ చేస్తే తప్పక కలుగుతారు.
* శనివారంనాడు ఈ చెట్టును తాకి, మృత్యుంజయ మంత్రాన్ని జపిస్తే, మృత్యుభయం తొలగుతుంది.

శనిదోష నివారణం

* అశ్వత్థాన్ని పూజించాక ఈ మంత్రాన్ని దృఢ విశ్వాసంతో జపిస్తే శని దోషం తొలగి, అభీష్ట సిద్ధి కలుగుతుంది.

శ్లో॥ కోణస్థః పింగళో యమః
కృష్ణో రౌద్రాంతకో యమః
శౌరిశ్శనైశ్చరో మందః
పిప్పలా దేవ సంస్తుతః

బ్రాహ్మణ సమారాధన

* అక్కడ పేద బ్రాహ్మణుడికి మృష్టాన్నం పెడితే కోటిమంది బ్రాహ్మణులకు సమారాధన చేసిన ఫలితముంటుంది.

స్వర్గప్రాప్తి

* అక్కడ చేసిన గాయత్రీమంత్ర జపం వలన నాలుగువేదాలు చదివిన ఫలితముంటుంది. రావిచెట్టుని స్థాపిస్తే నలభైరెండు తరాలవారికి స్వర్గం లభిస్తుంది.
* రావిచెట్టును కొట్టివేయడం మహాపాపం.

అభీష్ట సిద్ధి

పైన తెలిపిన రీతిలో ప్రదక్షిణలు చేసాక, ఆ సంఖ్యలో పదవవంతు హోమం, దానిలో పదవవంతు బ్రాహ్మణ సమారాధనం చేయాలి. ఈ వ్రతకాలంలో బ్రహ్మచర్యం అవలంబించాలి. ఉద్యాపన తరువాత బంగారు రావిచెట్టును, అలంకరించిన ఆవు, దూడలను, గుడ్డతో కప్పిన నువ్వుల రాశిని, ఉదారమైన దక్షిణలతో సౌశీల్యవంతులూ, కుటుంబీకులూ అయిన వేదవిప్రులకు దానమివ్వాలి. ఇలా చేస్తే అభీష్టం తప్పక సిద్ధిస్తుంది.



పట్టుదల, కృషి వున్నవాళ్ళకే విజయం లభిస్తుంది.

నియమాలు

* ఆది, సోమ, శుక్రవారాల్లో, సంక్రమణ సమయాలు మొదలగు నిషిద్ధ సమయాల్లోను, రాత్రి భోజనమయ్యాక ఈ వృక్షాన్ని సేవించకూడదు.
* సాధకులు మొదట ఆత్మస్తుతి, పరనింద, జూదం, అసత్యాలను విడిచిపెట్టాలి.

అని రావిచెట్టు గురించిన విశేషాలను బ్రహ్మాండపురాణంలో శ్రీ నారదముని ప్రస్తావించినట్లు శ్రీ గురుడు, గంగాంబకు తెలిపాడు. అప్పుడు గంగాంబ వారి సూచనల మేరకు అశ్వత్థ వృక్షానికి పూజ, అభిషేక, ప్రదక్షిణలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించి, అనతి కాలంలోనే సంతానవతి అయ్యింది.

శ్రీ గురుని అనుగ్రహంతో మేడిచెట్టు ద్వారా మొండివ్యాధి నివారించబడ్డ వైనం

ఒకానొక సందర్భంలో శ్రీ గురుడు మేడిచెట్టు కొమ్మ ద్వారా ఒక విప్రుని కుష్టువ్యాధిని తగ్గించారు. గాంధర్వపురంలో ఒకరోజు నరహరిశర్మ అనే విప్రుడు కుష్టువ్యాధితో బాధపడుతూ శ్రీ గురుని ఎదుట తన ఆవేదనను వ్యక్తం చేసాడు. అప్పుడు కరుణమూర్తి అయిన శ్రీ గురుడు అటుగా ఎండు కట్టెపుల్లలు పట్టుకెళుతున్న ఒక వ్యక్తిని పిలిచి, అతడి వద్దనుండి ఒక మేడికొమ్మని తీసుకున్నాడు. అది సుమారు నాలుగు సంవత్సరాల క్రితం ఎండిపోయిన మేడిచెట్టు కొమ్మ.

దాన్ని నరహరిశర్మకు ఇచ్చి సంగమేశ్వరాలయం వద్ద భీమా నది ఒడ్డున స్నానం చేసి, మూడుపూటలా ఆ పక్కనే వున్న రావిచెట్టుకు ప్రదక్షిణ చేసి, రెండు కుండల నీళ్ళు ఆ ఎండుకొమ్మకి పోయమని శ్రీ గురుడు చెప్పారు. ఈవిధంగా భక్తివిశ్వాసాలతో చేస్తే అతడి పాపం తొలగి, ఆ కొమ్మ చిగురించి వ్యాధి తగ్గుతుందని సూచించాడు.

నరహరి వారు చెప్పినట్లుగానే సంపూర్ణవిశ్వాసంతో చేయసాగాడు. దాన్నిచూసిన ఆ చుట్టుపక్కలవాళ్ళు నరహరిని ఎగతాళి చేయసాగారు. అయినా సరే అతడు వారంరోజుల పాటు నీరు కూడా తాగకుండా తన నియమాలను పాటించాడు.

ఒకరోజు శ్రీ గురుడు అనుష్ఠానం చేసుకుంటున్న నరహరిశర్మ వద్దకు వచ్చి, అతడి భక్తిశ్రద్ధలకు ముగ్ధుడై, తన కమండలంలోని నీరు తీసి ఆ ఎండు మేడికొమ్మమీద చల్లారు. మరుక్షణమే అది చిగురించింది. అనుష్ఠానానికని సంగమానికి వచ్చినవారంతా ఆశ్చర్య చకితులై చూస్తూ వుండగానే అది పెరిగి చిన్న మేడిచెట్టు అయింది.

నివ్వెరపోయి దాన్ని చూస్తున్న నరహరిశర్మకు కూడా కుష్టురోగం అదృశ్యమై అతడి శరీరం బంగారుఛాయతో మెరిసిపోసాగింది. అతడు ఆనందబాష్పాలు రాలుస్తూ, శ్రీ గురుని పాదాలకు భక్తితో నమస్కరించాడు. శరీరమంతా రోమాంచితమౌతుంటే, పారవశ్యంతో శ్రీ గురుని పలువిధాల స్తుతించాడు. తదుపరి అతనికి యోగ్యులైన ముగ్గురు కుమారులు పుట్టారు. శ్రీ గురుడు కొనియాడిన రావిచెట్టు, తానే స్వయంగా నాటించిన మేడిచెట్టు ప్రతి దత్తక్షేత్రంలోనూ తప్పక ఉండి తీరవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.



షిరిడిలో బాబా గురుస్థానం



రావి చెట్టు

షిరిడి సాయిబాబా - లెండి తోట

షిరిడి సాయి విషయానికి వస్తే, ఆయన గురుస్థానం వేపచెట్టు మొదల్లో ఉంది. బాబా ప్రతినిత్యం రెండుసార్లు లెండీతోటకి వెళ్ళి, స్వయంగా మొక్కలు నాటి, పాదులు చేసి, కాల్చని పచ్చి మట్టి కుండలతో నీరుపోసేవారు. అవి మట్టిలో కలసిపోయి ఎరువుగా మారేవి.

బాబా ఏరోజుకారోజు కొత్త కుండలను తెప్పించుకునేవారు. పారిజాతం, మామిడి, రావి, వేప, మేడి మొదలగు దివ్యవృక్షాలను బాబా స్వయంగా నాటి పెంచినట్లు, బాబా జీవితచరిత్రలో పేర్కొన బడింది.



నందా దీపం



లెండివనంలో దీపావళి సంబరాలు

నీచులే ఇతరులను అవహేళన చేస్తారు.

పుస్తక పారాయణం - మొక్కతో పరిపూర్ణం



శ్రీ గురుచరిత్ర, షిరిడి సాయిబాబా లీలా మృతాలను పారాయణ చేసిన ప్రతిసారీ రావి, మేడి, వేప, తులసి మొక్కలను అనువైనచోట నాటడం వల్ల మన ధర్మబద్ధమైన అభీష్టాలు అతి శీఘ్రంగా నెరవేరుతాయి. ఆ దత్తుని అనుగ్రహాన్ని మనతోపాటు మన రాబోయే తరాలవారికి కూడా పుణ్యఫలాన్ని అందించినవారమవుతాం. ప్రతి పారాయణానంతరం ఈ దివ్యవృక్షాలను విరివిగా నాటి, సంరక్షించి, పెంచటం వల్ల ఆ పారాయణానికి ఒక పరి పూర్ణత్వం వచ్చి, మన అభీష్టాలు తక్షణం నెరవేరేందుకు వనదేవతల దీవెనలు కూడా తోడ్పడతాయి.

శ్రీ దత్తజయంతి నాడు మీ దగ్గర్లో వున్న శ్రీ దత్త లేదా షిరిడి బాబా మందిరాల్లో ఈ దివ్యవృక్షాలను వీలైనన్ని నాటడం ఉత్తమోత్తమమైన సత్కార్యం. నడిచేదారుల వెంబడి గుబురుగా పలు తులసి రకాలను పెంచవచ్చు. లక్ష్మీ తులసి, కృష్ణ తులసి, లవంగా తులసి, కర్పూర తులసి, రుద్ర జడ మొదలగు రకాలు ఉంటాయి. ఈ దివ్యవృక్షాలన్నీ మీ ఆదరణ కోసం ఎదురుచూస్తున్నాయి. మరి ఈ దత్తజయంతి రోజు, శ్రీ దత్త మందిరాల్లో వాటికి ఉన్నత స్థానం కల్పించి, వాటి చల్లటి నీడను చక్కటి దీవెనలను పొందుదాం.

శ్రీ దత్తాయ గురవే నమః

శ్రీశ్రీ పాద శ్రీ వల్లభాయ నమః శ్రీనృసింహ సరస్వత్యై నమః

(మూలం : శ్రీ గురుచరిత్ర 39, 40 (పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ)

సూచన : ఔషధ గుణాలు సూచనమాత్రంగా ప్రస్తావించడం జరిగింది. వైద్యుని సంప్రదించిన పిదపనే వాటిని ఉపయోగించమనవి.



విద్య మనిషిని ఉన్నతుడిని చేస్తుంది.